www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 231, మంగళవారం 22-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి**



7లో..

**సర్ 2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి**



8వ పేజీల్లో

## 22ఏ భూముల్లో...

# మానవహక్కుల సంఘం జోక్యం

**స్వతంత్ర విచారణ చేపట్టాలని సీఎస్‌కు ఆదేశం**

**భూముల అంశంలో జాతీయ మానవ హక్కుల సంఘం స్వతంత్ర విచారణ చేపట్టాలని సీఎస్‌కు ఆదేశం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

తెలంగాణ రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర



విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. తమ ఆదేశాల విషయంలో తీసుకున్న చర్యలపై 4 వారాల్లో రిపోర్టు ఇవ్వాలని స్పష్టం




చేసింది. 22ఏ అంశంపై హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఈమేరకు చర్యలు తీసుకుంది.

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియామకం చేసింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

**న్యాయపరమైన వివాదాలు, కంప్యూటరైజేషన్ సమస్యలు**

నిషేధిత భూముల జాబితాలో ఇళ్లు, అపార్ట్‌మెంట్లను చేర్చడం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదానికి దారితీసింది. ఈ ఆందోళనకు ప్రధాన కారణాలుగా న్యాయపరమైన వివాదాలు, కంప్యూటరైజేషన్ ప్రక్రియలో జరిగిన లోపాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై సుమారు చాలా మేరకు దరఖాస్తులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి.

**కంప్యూటరైజేషన్ ప్రక్రియలో పొరపాటు**

ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లకు సమీపంలో ఉన్న భూములకు బైనంబర్లు ఉన్నాయని అధికారులు చెబుతుండగా, ఆ ఆస్తులు ప్రైవేట్ అని పేర్కొంటూ యజమానులు పెద్ద ఎత్తున కోర్టులను ఆశ్రయించారు. గత డిసెంబర్‌లో జిల్లా కలెక్టర్లు నిషేధిత భూముల జాబితాను ప్రభుత్వానికి సమర్పించినప్పుడు, ఆస్తులను ఌా, దీ, జ, ఙ , జు అనే వర్గాలుగా విభజించారు. అయితే కంప్యూటరైజేషన్ ప్రక్రియలో సంబంధిత సర్వే నంబర్ల ప్రస్తుత స్థితిని పర్యవేక్షించకుండా, సరిచూసుకోకుండానే రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ నుంచి వివరాలను నేరుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో అవి నిషేధిత జాబితాలోకి చేరాయి. వాటిని విక్రయించి రిజిస్ట్రేషన్ చేయాలనే దగ్గర 22ఏ సమస్య బయటపడింది. దీంతో చాలా మంది అయోమయంలో పడ్డారు. ఈ సమస్యపై స్పందించిన ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తామని వెల్లడిస్తూ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.



## నిధులు ఇస్తున్నా...

# పనుల్లో జాప్యం

**వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపై రేవంత్ సమీక్ష**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పనులు వేగంగా ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. నిధులు ఇస్తున్నా, పనుల్లో జాప్యం చోటుచేసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "వచ్చే 30 రోజుల్లో 24 గంటలపాటు పనులు జరగాలి. వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకెళ్లాలి. సీఎంవో అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో సమీక్ష చేయాలి. ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షించాలి. ఇక నుంచి కలెక్టర్ ప్రతిరోజు ఆసుపత్రి పనుల పురోగతిపై దృష్టి సారించాలి. త్వరలో ఓపీ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అలాగే సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేయాలని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సనత్‌నగర్ టిమ్స్ నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



## రామ మందిరంలో

# భారీ కుంభకోణం

**105 సార్లు విరాళాల చోరీ**

**సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం**

**ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్**

**సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు**

**ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:**

అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఞదీ×) లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

# దానం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీమ్



**అసెంబ్లీ స్పీకర్ ఆదేశాలను పక్కన పెట్టిన హైకోర్టు**

**హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం న్యాయవాదుల వాదనలు**

**నేడు విచారణకు వచ్చే అవకాశం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 :**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు.గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ..మిగతా 2లో

# రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

## శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

**రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన**

**ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి**

**గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ**

**ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం**

**నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు ..మిగతా 2లో





## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు

# హైకోర్టు నోటీసులు

**నాంపల్లి కోర్టు తీర్పును సవాల్ చేసిన టిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది.విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు.

## ఎస్ఐఆర్-2026పై రానున్న 30 నుంచి

# 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి







### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి**

**అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**

**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 21:**

ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, వీటి పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడుపరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25 తేదీలోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు.ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు.ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, బీఎల్ఏలను నోటీసుల పంపిణీ ప్రక్రియలో పాల్గొననివ్వకూడదని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లనుగుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను, నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దానం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీమ్

మొదటి పేజీ తరువాయి...

తరపున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.





## రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్

మొదటి పేజీ తరువాయి...

కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## బ్లూ బాయ్స్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక పూజలు.. అన్నదాన కార్యక్రమం



### ముఖ్య అతిథి... దారం సతీష్ గుప్తా

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 21 :**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బాలానగర్‌లోని రాజు కాలనీ రోడ్డులో బ్లూ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి వాణిజ్య విభాగం అధ్యక్షులు దారం సతీష్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దారం సతీష్ గుప్తా మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో బ్లూ బాయ్స్ సభ్యులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో రాజు కాలనీ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.



## ఎంగేజ్‌మెంట్ వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు

**గద్వాల , సెప్టెంబర్ 21:**

కర్ణాటక రాష్ట్రం రాయచూర్ పట్టణంలోని శ్రీరాఘవేంద్ర మఠం ఫంక్షన్ హాల్ లో సోమవారం కేటిదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామం మాజీ సర్పంచ్ మాధవి కులకర్ణి కుమార్తె గాయిత్రికులకర్ణి ఎంగేజ్‌మెంట్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గద్వాల జిల్లా జర్నలిస్టులు చుక్క సుదర్శన్, రవిబాబు, జ్యోతి రవి, ఉప సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మండల నాయకులు వెంకటపురం గోపి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన జంటకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుకు యువకుడు మృతి

**గద్వాల , సెప్టెంబర్ 21:**

పిడుగుపాటుకు యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం కేటిదొడ్డి మండలం యర్సన్ దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వలక్ష్మీ ఎంకప్ప దంపతుల ఏకైక కుమారుడు మల్లేష్ (17) వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో గ్రామ సమీపంలో ఉన్న ఆలయం వద్ద గల చెట్టు కింద నిలబడాడు. ఈ క్రమంలో చెట్టు మీద పిడుగుపడటంతో మల్లేష్ సంఘటన స్థలంలో మృతి చెందాడు. లక్ష్మీ ఎంకప్ప దంపతుల ఒకగానొక్క కుమారుడు మృతి చెందడంతో వారి రోధనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.



## గోనుపాడు గ్రామంలో ఘనంగా 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం

**గద్వాల , సెప్టెంబర్ 21:**

గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జి. రాములమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడమే ధ్యేయంగా గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ పెద్దలు ఒకే వేదికపైకి వచ్చి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జి. రాములమ్మ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛతను దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని కోరారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా పంచాయతీ కేటాయించిన నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులందరి సహకారంతో గోనుపాడు గ్రామాన్ని పరిశుభ్రమైన, ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచేందుకు పంచాయతీ తరపున అన్ని తగిన చర్యలు వేగవంతంగా తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యమ్మ రాముడు, పంచాయతీ కార్యదర్శి షాలేహా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

**– భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) , కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) , కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న గురుకులాలకు సొంత సొంత భవనాలు కేటాయించాలని, జిల్లా వ్యాప్తంగా గురుకులాలలో ఖాళీగా ఉన్న డిగ్రీ లెక్చరర్లు , జూనియర్ లెక్చరర్లు , పిజిటి టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర రాజ గా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మంద నాగక్రిష్ణ , కెవిపిఎస్ జిల్లా నాయకులు నందిపాటి రమేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మంద నాగక్రిష్ణ, కెవిపిఎస్ జిల్లా నాయకులు నందిపాటి రమేష్ మాట్లాడుతూ... జిల్లాలో గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలలో కొనసాగిస్తున్నారని గురుకులాల విద్యను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు గాలికి వదిలేశారని వాపోయారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా డిగ్రీ కళాశాల సొంత భవనాల నిర్మాణం కోసం ఒక్కొక్క కళాశాలకు 32 కోట్ల రూపాయలు, జూనియర్ కళాశాలకు సొంత భవనాల నిర్మాణం కోసం ఒక్కొక్క 23 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తూ జి ఓ నెంబర్ 20ని తీసుకొని వచ్చింది. ఈ క్రమంలోనే జిల్లాలో సాంఘీక సంక్షేమ శాఖ డిగ్రీ కళాశాలకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల వద్ద 10 ఎకరాల స్థలం కేటాయించారు. ఇక్కడ ఎటువంటి నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం ఈ డిగ్రీ కళాశాల పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వహిస్తున్నారని అన్నారు. ఇందుకుగాను 7 లక్షలు అద్దె చెల్లిస్తున్నారని ఒక సంవత్సరానికి 84 లక్షలు అద్దె చెల్లిస్తున్నారని అన్నారు. అదేవిధంగా మణుగూరులో గురుకుల జూనియర్ కళాశాలకు 5 ఎకరాల స్థలం కేటాయించారని ఇక్కడ కూడా నిర్మాణం చేపట్టలేదని అన్నారు. ప్రభుత్వం స్థలాలు కేటాయించబడి నిర్మాణం చేయని కారణంగా ప్రతి సంవత్సరం రెండు కోట్లకు పైగా అద్దెలు చెల్లిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారు అన్నారు. ఇదే డబ్బుతో శాశ్వత భవనాలు నిర్మిస్తే విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన సౌకర్యాలతో మంచి విద్యాబోధన చేయవచ్చు అని వారన్నారు. కళాశాలలను అర్థ భవనాల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు అరకొర వసతులతో అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని, అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీలో భవనంలో నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాలలో పక్కనే ఉన్న కేటీపీఎస్ నుండి వెదజల్లుతున్న యాష్ బూడిద కారణంగా మరియు పొగ కాలుష్యం వలన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చర్మవ్యాధులు ,శ్వాసకోశ వ్యాధులు, జుట్టి రాలిపోవడం తదితర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాబట్టి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా కేటాయించిన స్థలంలో సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న 9 గురుకులాల్లో ఖాళీగా ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాల లెక్చరర్స్ , పిజిటి టీచర్ పోస్టులను భర్తీ చేయాలని విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు టీచర్స్ లెక్చరర్స్ లేరని ఇలా సరిపడా ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులు విద్యను అభ్యసించడంలో తీవ్రంగా వెనుకబడి పోతున్నారని వారు అన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న డిగ్రీ లెక్చరర్స్ 5 పోస్టులు , 17 జూనియర్ లెక్చరర్స్ పోస్టులు, 27 పిజిటి టీచర్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు కాళీ పోస్టులను భర్తీ చేయడానికి అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు , రిక్రూట్మెంట్ కోసం జిల్లా కలెక్టర్ గారు ఆరుగురు అధికారుల తోటి కమిటీ నియమించారు ఈ కమిటీ పర్యవేక్షణలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ డెమో క్లాసులు నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వలేదు. నాలుగు నెలలుగా పూర్తిస్థాయిలో క్లాసులు జరగక పేద దళిత విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని వారు వాపోయారు. చాలామంది విద్యార్థులు తల్లిదండ్రులు పాఠాలు జరగనందున టిసిలు ఇవ్వాలని మా పిల్లలను మరోచోట చేర్పించుకుంటామని వారు చెబుతున్నారు పిల్లల చదువులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా సకాలంలో లెక్చరర్ టీచర్ల పోస్టుల భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిన ఫలితంగా దళిత విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల కనకయ్య , ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తేజ హర్ష తదితరులు పాల్గొన్నారు.

# 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**శెట్టిపల్లి గ్రామపంచాయతీలో బైక్ భారీ ర్యాలీ**



**గుండాల సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ ) :** అఖిలభారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రేగులగుడెం, శెట్టిపల్లి , పెద్ద చెలక, నల్ల చెలక, గోరకలమడుగు, శంభునిగూడెం, వెన్నెలబైలు, సర్వాపురం గ్రామాలలో బైక్ ర్యాలీ ఎ ఐ కె ఎం ఎస్ మండల అధ్యక్షుడు బచ్చల సారయ్య జెండా ఊపి ప్రారంబించారు. అనంతరం పునేం శ్రీను, జార్జ్, కల్తీ మల్లయ్య అధ్యక్షతన జిల్లా నాయకులు బచ్చల సారయ్య ఎ ఐ టి ఎఫ్ జిల్లా నాయకులు ఇర్ప రాజేష్ మాట్లాడుతూ. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయకరంగాన్ని దివాలా తీపించి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయకరంగాన్ని బహుళ జాతి కంపెనీలకు అంబానీ ఆదానీలకు కట్టబెడుతుంది. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని యూరియా యాప్ ను రద్దు చేయాలని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రజా పోరాటంలో భాగస్వాములు కావాలని, ముఖ్యంగా రైతుల కు గిట్టుబాటు ధర కల్పించాలని, మొక్కజొన్న కింటకు 3000, పత్తి 15000 ఇవ్వాలని కోరుతూ అందులో భాగంగానే ఖమ్మంలో జరుగు అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలు జరుగుతున్నాయి ఈ మహాసభలకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రావాలనివారు పిలుపునిచ్చారు. లిఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి తప్పెట్ల రాములు, పెంటయ్య, మల్యాల మల్లేష్, శీలం యాదయ్య, కల్తీ మల్లయ్య, కల్తీ బొర్రయ్య, ముచ్చ మధు, కానబోయిన ఉపేందర్, గుమ్మడెల్లి, వెంకన్న,కల్తీ సర్వయ్య,ఇర్ప రమేష్ పర్శిక పొట్టయ్య, పొడుగు జార్జ్, కిన్నెర కృష్ణ, పునేం రాంబాబు,కిన్నెర నవీన్, పర్శిక సురేష్, పునేం శ్రీను, కుంజ లక్ష్మయ్య, కుంజ చిన్న స్వామి, బొర్ర విక్రమ్,గుగులోత్ గణేష్ గుగులోత్ రమేష్, కృష్ణ, పాల్గొన్నారు.

# విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

**– పరుల సేవే పరమార్థం – ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం శ్రీనివాసరావు**





**వైరా, సెప్టెంబర్ 21, (భద్రాద్రి న్యూస్ ):** వైరా నియోజకవర్గ మండల పరిధి గొల్లపూడి వృద్ధాశ్రమానందు సోమవారం వివిధ కారణాల చేత ఆశ్రమం నందు ఆశ్రయాన్ని పొందుతున్న వృద్ధులకు అవసరమైన దుస్తులను జీవి మాల్ వారి విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం శ్రీనివాసరావు, సీత గార్ల సహకారంతో అందజేసినట్లు లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు అన్నారు. పలు సందర్భాల్లో విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని గొల్లపూడి వృద్ధాశ్రమ నందు వృద్ధులకు దుస్తులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక కారణాలవల్ల కుటుంబాలకు దూరంగా ఉంటూ, ఈ ఆదరణ లేక వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు సేవలను అందించడం నిజమైన మానవ సేవ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కొల్లా రాంబాబు, కార్యదర్శి కోడుమూరు రవి, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ నూకల ప్రసాద్, మిట్టపల్లి శ్రీమన్నారాయణ, ఆశ్రమ నిర్వాహకులు నరసింహారావు, కవిత, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలు

**– 2026కు దరఖాస్తుల ఆహ్వానం**




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 1, 2026న ప్రదానం చేయనున్న వయోవృద్ధుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలు––2026 కోసం అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ అధికారులు తెలిపారు. వయోవృద్ధుల సాధికారత, సంక్షేమం కోసం విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఈ పురస్కారాలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కేటగిరీలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లు దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక సేవ, సమాజ అభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్య సేవలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, క్రీడలు, వ్యవసాయం, సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్, ప్రజాసేవ, పర్యావరణం, సమాజ సంక్షేమం తదితర రంగాల్లో గణనీయమైన కృషి చేసిన సీనియర్ సిటిజన్లను పరిగణనలోకి తీసుకోనున్నారు. అదేవిధంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం అసాధారణ సేవలు అందిస్తున్న వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోవృద్ధుల రక్షణ, సంక్షేమం, వారి శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నవారు, వారి జీవన ప్రమాణాల్లో గణనీయమైన మెరుగుదలకు దోహదపడుతున్నవారు అర్హులు. సంస్థాగత కేటగిరీలో వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, రక్షణ, సాధికారత కోసం నిరంతర, వినూత్న, ఆదర్శప్రాయమైన సేవలు అందిస్తున్న సంస్థలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వయోవృద్ధుల సంఘాలు, ఎన్జీవోలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు. కేటగిరీల వారీగా దరఖాస్తు ఫారాలు, మార్గదర్శకాలను **www.wdsc.telangana.gov.in?** వెబ్‌సైట్‌లో పొందవచ్చని అధికారులు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి సెప్టెంబర్ 26, 2026 సాయంత్రం 5 గంటలలోపు హార్డ్‌కాపీ రూపంలో సమర్పించాలి. దరఖాస్తు సమర్పించాల్సిన చిరునామా: సంచాలకుల కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ, గ్రౌండ్ ఫ్లోర్, దివ్యాంగుల సంక్షేమ భవన్, నల్గొండ ఎక్స్ రోడ్, మలక్‌పేట్, హైదరాబాద్––500036. మరిన్ని వివరాల కోసం 6301981960, 8331006010 నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలి

**- ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలి**

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు**



**కారేపల్లి, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లిలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ హామీ అమలులో జాప్యం జరుగుతుండటంతో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం కింద రూ.10 లక్షల సాయం అందించినప్పటికీ, అర్హులైన ప్రతి కుటుంబానికి ఆ ప్రయోజనం అందలేదని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళితబంధుకు బదులుగా అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా రూ.12 లక్షలు అందిస్తామని ప్రకటించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో అనేక మంది భూమి, ఇల్లు, విద్య, వైద్యం, స్వయం ఉపాధికి అవసరమైన ఆర్థిక వనరులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయా కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ఆర్థిక సాయం అందించడం అత్యవసరమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నట్లు చూపుతున్నప్పటికీ, అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలుకు నిధులు కేటాయించి ఖర్చు చేయకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చి, ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు కోరారు. హామీ అమలు చేయకపోతే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాట కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ముగ్గురు వికలాంగ పిల్లలతో తల్లి గోడు

**- మానవత్వ చాటుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి లెనీనా**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** భూ సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చిన ఓ వృద్ధ తల్లి, తన ముగ్గురు వికలాంగ పిల్లల పరిస్థితి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఇల్లందు మండలం రాఘబోయినగూడెం గ్రామానికి చెందిన ఈసం కన్నమ్మ తన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్‌కు వచ్చింది. ముగ్గురు పిల్లలూ మానసిక అంగవైకల్యంతో బాధపడుతున్నారు. భూ సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చిన కుటుంబాన్ని చూసిన వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి లెనీనా వారి పరిస్థితికి చలించిపోయారు. వెంటనే వారిని తన కార్యాలయానికి తీసుకెళ్లి వారి అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం రెండు టాయిలెట్ సైకిళ్లను అందజేశారు. వీల్‌చైర్లను కూడా త్వరలో అందజేస్తామని తెలిపారు. తన ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చిన వృద్ధ తల్లి పరిస్థితిపై అధికారి స్పందించి తక్షణ సహాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి లెనీనాకు కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబానికి భూ సమస్యను కూడ పరిష్కరించాలని కోరారు.

# అక్రమ రవాణా నిర్మూలనలో అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలి

**- మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించాలి: సీడీపీఓ ఉమ**

**- అప్పాయిగూడెం రైతు వేదికలో మహిళా అక్రమ రవాణా, సైబర్ నేరాలపై శిక్షణ**

**కారేపల్లి , సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** మహిళలు, చిన్నారుల అక్రమ రవాణా నిర్మూలనలో అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని సీడీపీఓ ఉమ సూచించారు. అప్పాయిగూడెం రైతు వేదికలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్, సంబంధిత చట్టాలపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉమ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా తీవ్రమైన సామాజిక నేరమని, ప్రతిరోజూ ఎంతోమంది బాలికలు, మహిళలు ఈ ముప్పును ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, మెసెంజర్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసే ఫొటోలను సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేసి మార్ఫింగ్ చేయడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తల్లుల సమావేశాలు, గ్రామస్థాయి కార్యక్రమాల్లో మహిళలు, బాలికలకు సైబర్ నేరాలు, అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు, మహిళలు, బాలికలపై నేరాలు జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. సంబంధిత చట్టాల అమలులో అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

**చట్టాలపై అవగాహన అవసరం**

ప్రజ్వల జిల్లా సమన్వయకర్త సురేష్ కుమార్ మాట్లాడుతూ.. బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందన్నారు. పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వేలాది మంది బాలికలు, చిన్నారులను రక్షించి పునరావాసం కల్పించినట్లు తెలిపారు.

అక్రమ రవాణా, సైబర్ ఆధారిత నేరాలను అరికట్టేందుకు అంగన్‌వాడీ టీచర్లకు సంబంధిత చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)–2023, అనైతిక అక్రమ రవాణా నిరోధక చట్టం (ఐటీపీఏ)–1956, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో)–2012, బాల్య వివాహాల నిషేధ చట్టం–2006, బాలల న్యాయ చట్టం (జేజేఏ)–2015 తదితర చట్టాల్లోని ముఖ్యమైన నిబంధనలు, సెక్షన్లపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

**హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన**

మహిళలు, చిన్నారులు, సమాజంలోని ఎవరైనా సమస్యను ఎదుర్కొన్నప్పుడు సంబంధిత హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సురేష్ కుమార్ సూచించారు. 112 అత్యవసర పోలీసు సేవలు, 1930 సైబర్ నేరాల ఫిర్యాదులు, 181 మహిళా హెల్ప్‌లైన్ సేవలకు సంబంధించిన వివరాలను శిక్షణలో వివరించారు. సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా బాధితులకు సకాలంలో సహాయం అందేలా చూడాలని తెలిపారు. శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లతో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్లు భూపాల్, నాగరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యశీల, దేవేంద్ర, కృష్ణకుమారి, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్‌తో పాటు సింగరేణి మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.








# 22న హోమ చూర్ణం మరియు నెయ్యి పంపిణీ

***– 25న ప్రకాశం స్టేడియంలో గణేష్ నిమజ్జన పూజ***

***– గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్***




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** ఈనెల 22వ తేదీన గణపతి మండపాలు ఏర్పాటు చేసిన వారికి ఉచితంగా హోమ చూర్ణం మరియు ఆవు నెయ్యి పంపిణీ చేయడం జరుగుతుందని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు న్యాయవాది యెర్రా కామేష్ తెలిపారు. సోమవారం వివేకానంద హైస్కూల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు 22వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కల్లా వివేకానంద హైస్కూల్ కు చేరుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసే హోమ చూర్ణం మరియు ఆవు నెయ్యి పంపిణీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 25వ తేదీన నిమర్జన కార్యక్రమం స్థానిక ప్రకాశం స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు పూజాకార్యక్రమం అనంతరం ప్రకాశం స్టేడియం నుండి శోభాయాత్ర ప్రారంభమై సూపర్ బజార్ సెంటర్ లో ఏర్పాటు చేసిన స్టేజ్ వద్ద గణనాధులకు స్వాగత ఏర్పాట్లు చేయడం జరిగిందని, గణేష్ ఉత్సవాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు కొత్తగూడెంలో జరిగే శోభాయాత్రలో పాల్గొనుటకు మధ్యాహ్నం 3 గంటల కల్లా స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకొని నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పలివేల సాంబశివరావు, ఆంధ్రప్రభ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దారా రమేష్, మెరుగు చింతేశ్వర్, అవుటుపల్లి రాంబాబు, కుడిక్యాల సమ్మయ్య, ఆకుల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు గుడి పూడి తిరుమలరావు

**- వినాయక మండపంలో ప్రత్యేక పూజలు..**
**అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**



**కారేపల్లి, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కారేపల్లి పాత సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు సందర్శించారు. తన చిన్ననాటి పాఠశాల మిత్రుడు పరిటాల రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద గణనాథుడిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో కారేపల్లి ప్రజలతో పాటు సింగరేణి మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధితో జీవించాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించిన ఆయన.. ఉత్సవాలు విజయవంతంగా, ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ టోనీ, వోరికొర్ల వీరభద్రం, సామినేని తిరుపతిరావు, పొట్లకాయల మహేష్, యాకూబ్, సత్యనారాయణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ మాజీ కార్యదర్శి చందా నాయక్‌కు ఘన నివాళి

**- పార్థివదేహంపై పార్టీ కండువా, పూలమాల ఉంచి నివాళులర్పించిన నాయకులు**



**కారేపల్లి , సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) భాగ్యనగర్ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి స్వర్గీయ గుగులోత్ చందా నాయక్ మృతికి సీపీఐ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన పార్థివదేహంపై పూలమాల, పార్టీ కండువా ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చందా నాయక్ పార్టీకి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన మృతి పార్టీకి, కార్యకర్తలకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య కార్యవర్గ సభ్యులు బానోత్ ఈరునాయక్, జిల్లా సమితి సభ్యులు చేన్నంశెట్టి భూషయ్య, ఇల్లందు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కె. వలీ, భాగ్యనగర్ శాఖ కార్యదర్శి ఇస్లావత్ భవసింగ్, శాఖ సహాయ కార్యదర్శి వంకుడోత్ శ్రీకొలియా, సింగరేణి మండల కార్యవర్గ సభ్యులు వాంకుడోత్ హరిసింగ్, ఏఐటీయూసీ ఇల్లందు కార్యవర్గ సభ్యులు గుగులోత్ రావుజీ, ఏఐటీయూసీ మణుగూరు నాయకులు గుగులోత్ రవి, ఏఐటీయూసీ భూపాలపల్లి నాయకులు ఇస్లావత్ దళ్‌సింగ్ (బాబు), అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సభ్యులు గుగులోత్ బాలకిషన్, ఏఐవైఎఫ్ సింగరేణి మండల ఉపాధ్యక్షులు సపావత్ రవికుమార్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొని చందా నాయక్‌కు నివాళులర్పించారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**- పేరుపల్లి మండల పరిషత్ పాఠశాలలో కార్యక్రమం..**
**- సర్పంచ్ పద్మావతి ఆధ్వర్యంలో పంపిణీ**



**కారే పల్లి, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** పేరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించడంతో పాటు పాఠశాలలో క్రమశిక్షణ, ఐక్యతకు ఏకరూప దుస్తులు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల చదువుతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది, 9వ వార్డు సభ్యులు ఎండీ మౌలాలి, 5వ వార్డు సభ్యులు వీరభద్రం, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీపీఎస్ ఏ కాలనీలో ఘనంగా గణేష్ ఉత్సవాలు



**పాల్వంచ, సెప్టెంబర్21 (భద్రాద్రి న్యూస్):** కేటీపీఎస్ ఏ కాలనీలో చెరుకు భాగ్యలక్ష్మి--అశోక్ కార్పొరేటర్ గారి కుమారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కరరావు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎన్నో సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ, భక్తులకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న చెరుకు భాగ్యలక్ష్మి--అశోక్ కార్పొరేటర్ కుమారులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులను బూర్గుల విజయభాస్కరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, విజయవంతంగా నిర్వహిస్తున్న చెరుకు భాగ్యలక్ష్మి--అశోక్ కుటుంబ సభ్యులకు, వారి కుమారులకు మరియు ఉత్సవ కమిటీ సభ్యులందరికీ తన తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భక్తి, సేవా భావంతో ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీ గణనాథుని ఆశీస్సులతో నిర్వాహకులు, భక్తులు మరియు వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బూర్గుల విజయభాస్కరరావు ఆకాంక్షించారు.

# స్వయం నియంత్రణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వుస్తాల సోమిరెడ్డి.
- సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహన సదస్సు
-ఆలోచింపజేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మధిర వినూత్న కార్యక్రమం
- మత్తు మనిషిని బానిసగా మార్చి ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకమవుతుందన్న ఎక్సైజ్ సీఐ బాల కిషన్



**వైరా, సెప్టెంబర్ 21, (భద్రాద్రి న్యూస్ ) :** విద్యార్థులు చెడు వైపుకు వెళ్ళకుండా స్వయం నియంత్రణతో తమకు తాము ఉన్నత మార్గంలో నడుచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి అన్నార. సోమవారం మధిర కిష్టాపురం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం ,ముదిగొండ లో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహన సదస్సు లో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి రాములు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడమే కాకుండా తమకు నచ్చిన విదేతర కార్యక్రమాలపై దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి తమ గ్రామాలకు వెళ్లిన తరువాత తన చుట్టూ ఉండే వారిలో ఎవరైనా మత్తుకు అలవాటు పడితే వారిని సక్రమమైన మార్గంలో తీసుకువచ్చే పోలీస్ డిపార్ట్మెంట్కు సమాచారం ఇచ్చి కాపాడాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు బంధువులకు తమ తోటి వారికి బాదకద్రవ్యాల నివారణ పై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు మనిషిని సమాజంలో క్షీణత కు గురి చేస్తుందని మనిషి తన నియంత్రణ కోల్పోయి సమాజంలో చీత్కరించబడతాడు అన్నారు. ఆరోగ్యకరమైన గొప్ప సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎనలేనిది అన్నారు. అందుకే విద్యార్థి చదువుతోపాటు సమాజ నిర్మాణం పరిసరాల శుభ్రతను చక్కగా ఉండేలా చూసుకోవాలన్నారు హోనిసలుగా ఉండడం మరొకరి నియంత్రణలో కాకుండా విద్యార్థులు తమకు తాముగా స్వయం నియంత్రణలో స్వయం శక్తితో ఉత్తమ పౌరులు ఎదగడానికి ప్రయత్నించాలన్నారు అవసరమైన ప్రతి సందర్భంలో ఉపాధ్యాయుల నుండి పూర్తిని పొందాలన్నారు.కార్యక్రమంలో మధిర ఎక్సైజ్ సీఐ బాలకిషన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐనాల సైదులు,మధిర ఎక్సైజ్ సీఐ బాలకిషన్, జేవిపి సంజీవరావు, సీనియర్ అధ్యాపకులు కొక్కిరేణి సత్యం , నాగేశ్వరరావు,రామయ్య ఉపాధ్యాయులు సామ్సన్, రేణుక, రాధిక, శరత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# బీజాపూర్ అడవుల్లో నక్సలైట్ ఆయుధ డంప్ గుట్టురట్టు!

**- లొంగిపోయిన నక్సలైట్ల సమాచారంతో పోలీసుల మెరుపు ఆపరేషన్.. ఏకే-47 సహా నాలుగు ఆయుధాలు, 76 లైవ్ రౌండ్లు స్వాధీనం**

**చర్ల, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్) :** ఛత్తీస్‌గఢ్‌లోని నక్సలైట్ ప్రభావిత బీజాపూర్ జిల్లాలో పోలీసులకు కీలక విజయం లభించింది. భైరమ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉట్లా గ్రామ అటవీ ప్రాంతంలో నక్సలైట్లు భూగర్భంలో రహస్యంగా దాచిన ఆయుధ డంప్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన నక్సలైట్ల నుంచి అందిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని చేపట్టిన సోదాల్లో ఏకే-47 రైఫిల్ సహా నాలుగు ఆయుధాలు, రెండు ఏకే-47 మ్యాగజైన్లు, 76 లైవ్ రౌండ్లు బయటపడటం కలకలం రేపింది. బీజాపూర్ ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలో నక్సలైట్ కార్యకలాపాలపై నిఘా, సోదాలు కొనసాగుతున్నాయి. లొంగిపోయిన నక్సలైట్లను విచారిస్తున్న క్రమంలో లభించిన కీలక సమాచారంతో ఉట్లా అటవీ ప్రాంతంలో ఆయుధ డంప్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా పర్యవేక్షణలో, అదనపు ఎస్పీ (నక్సల్) అమన్ ఝా నాయకత్వంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. భైరమ్‌గఢ్ ఎస్‌డీఓపీ నవీన్ ఎక్కా ఆధ్వర్యంలో భైరమ్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బలగాలు, డీఆర్‌జీ సిబ్బంది ఉట్లా అడవుల్లోకి వెళ్లి విస్తృతంగా గాలింపు చేపట్టారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అనుమానాస్పద ప్రాంతాన్ని పరిశీలించగా.. భూమిలో పాతిపెట్టి రహస్యంగా దాచిన నక్సలైట్ ఆయుధ డంప్ బయటపడింది.

**డంప్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో:**

- 01 ఏకే-47 రైఫిల్
- 01 .315 బోర్ రైఫిల్
- 01 సింగిల్‌షాట్ రైఫిల్
- 01 9 ఎంఎం పిస్టల్
- 02 ఏకే-47 మ్యాగజైన్లు
- 45 ఏకే-47 లైవ్ రౌండ్లు
- 25 9 ఎంఎం లైవ్ రౌండ్లు
- 06 .315 బోర్ రైఫిల్ లైవ్ రౌండ్లు ఉన్నాయి.

మొత్తంగా 76 లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని భద్రంగా భైరమ్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసులో తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

**లొంగుబాట్ల సమాచారంతో వరుసగా డంప్‌ల వెలికితీత**

లొంగిపోయిన నక్సలైట్ల నుంచి సేకరిస్తున్న సమాచారాన్ని పోలీసులు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లలో వినియోగిస్తున్నారు. వారి నుంచి సంస్థ కార్యకలాపాలు, గత ఘటనలు, అడవుల్లో దాచిన ఆయుధాలు, ఇతర సామగ్రికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అదే సమయంలో



లొంగిపోయిన వారిని సమాజంలోని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి పునరావాస, సామాజిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఉట్లా అడవుల్లో ఆయుధ డంప్ పట్టుబడటంతో నక్సలైట్ల రహస్య ఆయుధ నిల్వలపై భద్రతా బలగాల నిఘా మరింత కట్టుదిట్టమైంది. సున్నిత, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో సోదాలు, గాలింపు, నిఘా కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కొల్లి పౌండేషన్ ఆధ్వర్యంలో లీగల్ అవేర్నెస్ & మోటివేషన్

**- కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీస్ డిపార్ట్మెంట్ సహకారంతో వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవేర్నెస్**





**వైరా, సెప్టెంబర్ 21, (భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 9, 10 వ తరగతి, జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం లీగల్ అవేర్నెస్ ఽ మోటివేషన్- యంగ్ మైండ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఓసిఎస్ఓ చట్టం, మైనర్లకు వర్తించే చట్టపరమైన సెక్షన్లు, శిక్షలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టపరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం, బాధ్యతాయుతమైన ప్రవర్తన, మంచి నైతిక విలువలు, క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఎలాంటి తప్పులకు పాల్పడకుండా, మంచి ఆలోచన పౌరులుగా, ఉన్నతమైన విలువలతో విద్యను అభ్యసిస్తూ సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైరా సీఐ వెంకట ప్రసాద్, వైరా ఎస్సై పుష్పాల రామారావు, కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి కల్పనా చౌదరి, వైరా విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాస్ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన జ్యోతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ పాల్గొనగా ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు

# మహిళా సంఘాల అభివృద్ధికి 'సెర్ప్' పథకాలు దోహదం

**- వెలుగు ఏపీఎం వెంకట రామారావు**
**- కామేపల్లిలో 'విజేత గ్రామ సమాఖ్య' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**



**కామేపల్లి,సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకుని, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం 'సెర్ప్' ద్వారా అనేక కార్యక్రమాలను అందిస్తోందని ఏపీఎం ఎం. వెంకట రామారావు, అజంతా మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. కామేపల్లి మండల కేంద్రంలోని విజేత గ్రామ సమాఖ్య భవనంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సెర్ప్ కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు ఎన్. తిరుపతమ్మ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి సీనియర్ స్టేట్ సీఆర్పీలు టి. కవిత, కె. మమతలు హాజరై గ్రూపు సభ్యులకు పలు కీలక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకట రామారావుతో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్వాక్రా సంఘాల్లో ఐక్యతను పెంపొందించే 'సంఘ భావన', పంచ సూత్రాల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. సంఘం లెక్కల పుస్తకాల నమోదు, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పాటించడంతో పాటు, మారుతున్న కాలానికి అనుగుణంగా 'లోకోస్' మొబైల్ యాప్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం వంటి సాంకేతికతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమాఖ్య కార్యదర్శి ఎం. శృతి, కోశాధికారి కె. విజయ, విఓఏ శ్రీనులతో పాటు వివిధ గ్రూపుల (శృతి, గాంధీ, ఆనంద్, అస్త్ర, మదర్ తెరెసా, పృథ్వి, కనకదుర్గ) లీడర్లు, సభ్యులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద మహాఅన్నదానాలు భక్తిశ్రద్ధలతో పూజలు



**కామేపల్లి,సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** గణేష్ నవరాత్రి ఉత్సవాల పండుగ రంగా రంగా వైభవంగా మహా ఘనంగా జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామేపల్లి మండల కేంద్రంలోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయ మందిరంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు తొలుత గణేశునికి వివిధ పార్టీల నేతలు గణేశు నికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం.గ్రామ సర్పంచ్ అజ్మీర బుల్లి హరి నాయక్ మా అన్నదానం లో ముఖ్యఅతిథిగా పాల్గొని వారి చేతుల మీదగా ప్రారంభించారు. ఉపసర్పంచ్ నాగమణి ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర నాగార్జున రావు లచే వందలాదిమంది భక్తులకి మహా అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజ్మీర రామదాస్ హరిజన నాయక్ బిజెపి నాయకులు పోలూరి రామచంద్రయ్య. రంగారావు.జరపల రామారావు టిఆర్ఎస్ నాయకులు అంతోటి అచ్చయ్య ఆలయ అర్చకులు మెండ్రు పుల్లయ్య గురుస్వామి.బ్రహ్మం రవి నాయక్.రమేష్ నాయక్.బిక్షం.ప్రేమ్ సింగ్ సీతారాములు మహేందర్.వెంకట్ కోటగిరి రాము. సుమన్.అజ్మీర రాజు నాయక్.కొర్ర రాములు తదితరులు పాల్గొన్నారు

# ఆదర్శవంతంగా కామేపల్లి హరిజనవాడ అంగన్వాడి కేంద్రం

**- స్ఫూర్తిదాయకంగా కిచెన్ గార్డెన్**
**- ఐసిడిఎస్ సిడిపిఓ ఉమ**







**కామేపల్లి,సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి హరిజనవాడ అంగన్వాడీ కేంద్రం ను ఐసిడిఎస్ సిడిపిఓ ఉమ సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ,పిల్లల హాజరు శాతం, కేంద్రం ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న సేవలు,కిచెన్ గార్డెన్,ప్రీస్కూల్ నిర్వ హణ,పిల్లల ఆట వస్తువులు,త్రాగునీరు,పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం,బోధన,తదితర అంశాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.అంగన్వాడీ కేంద్రం ఆదర్శవంతంగా, కిచెన్ గార్డెన్ స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు.అదే విధంగా పచ్చదనం, పరిశుభ్రత, ఆకుకూరలు, కూరగాయల పెంపకం పట్ల కూడా సిడిపిఓ సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పిడమర్తి ఉపేంద్రమ్మ,ఆయా, పిల్లలు, తల్లులు,గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడే ప్రకృతి స్వరూపం ప్రజలు చల్లగా ఉండాలి

**- పండితాపురంలో వైభవంగా అన్నదానం ప్రారంభించిన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు**





**కామేపల్లి,సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** విఘ్నేశ్వరుడే నిజమైన ప్రకృతి స్వరూపమని, ప్రత్యేక నియమాలతో పనిలేకుండా మనకు లభించే పత్రాలు, పూలతోనే స్వామిని ఆరాధించవచ్చని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని కొత్త కాలనీ వద్ద ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావుతో కలిసి ఆయన ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంలో స్వామివారికి పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ.. సర్వ విఘ్నాలు తొలగించే గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మట్టి గణపతి పూజల అనంతరం గంగమ్మ ఒడికి చేరడమే ప్రకృతితో ఆయనకున్న విడదీయరాని బంధానికి నిదర్శనమన్నారు. వినయానికి ఆరితేరిన బొజ్జ గణపయ్య తల్లిదండ్రుల సేవలో అగ్రగామిగా నిలిచి ప్రథమ పూజార్హుడయ్యాడని కొనియాడారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో పండితాపురం గ్రామంలో అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా చూస్తామని హామీ ఇచ్చారు. దివంగత ఉస్మాన్ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని దాతృత్వంతో నిర్వహించిన ఆయన తల్లిదండ్రులు షేక్ రబ్బానీ పాషా-మీరాభి దంపతులను, నవరాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకులను ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ అనూరాధ, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, వార్డు సభ్యులు మీరాబి, చంద్రు, కొమ్మినేని పుల్లయ్య, మొగిలి శ్రీను, ఉప్పుగంట వీరభద్రరావు, శీలం పుల్లయ్య, దేరంగుల తిరుపయ్య, పాటిబండ్ల ప్రసాదు, భూక్యా నాగేంద్రబాబు, తురక బిక్షం, రాయల నాగ శంకర్, మంజుల వెంకన్న, చల్ల మల్లయ్య, బానోతు లక్ష్మ, బాదావత్ నాగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి లేక రాళ్లపురం ప్రజల అవస్థలు..

**- ఇంకెన్నాళ్లు ఈ నిర్లక్ష్యం?**

**- అటవీ అనుమతుల పేరుతో ఏళ్లుగా జాప్యం.. అత్యవసర వేళల్లో నరకయాతన**

**- రహదారి, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్‌కు వినతి**



**చర్ల,సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** అటవీ ప్రాంతంలో ఉన్న రాళ్లపురం గ్రామం అభివృద్ధికి దూరంగా మిగిలిపోతోందని, కనీస మౌలిక సదుపాయాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి రహదారి సమస్య పరిష్కారం కాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లోనూ ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటూ భద్రాచలం సబ్ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రాళ్లపురం గ్రామ సమస్యలను వివరించారు. చర్ల మండలంలోని రాళ్లపురం అటవీ ప్రాంతంలో ఉండటంతో సరైన రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు నిత్య అవస్థలు పడుతున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాలన్నా.. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా రహదారి కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, రహదారి సౌకర్యం లేక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఏళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామం అభివృద్ధికి దూరంగా మిగిలిపోయిందని పేర్కొన్నారు. రాళ్లపురం గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టేందుకు అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను త్వరితగతిన ఇప్పించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. రహదారితో పాటు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర కనీస మౌలిక సదుపాయాలను కూడా వెంటనే కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సమస్యలపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సంబంధిత అటవీ శాఖ అధికారులతో మాట్లాడి రహదారి నిర్మాణానికి అవసరమైన అనుమతులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు పరిటాల సంతోష్ కుమార్, గ్రామస్తులు ముసికి ప్రవీణ్, ముసికి రాజయ్య, కరాటం గంగయ్య, ముసికి గంగోలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా ప్రియదర్శినిని సత్కరించి, అభినందించిన భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించి, అంకితభావం కృషి దీక్ష దక్షతలతో న్యాయవాద వృత్తిని చేపట్టి, ముఖ్యంగా పేద ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు, విశిష్టమైన న్యాయపరమైన సేవలు అందిస్తూ న్యాయవాద వృత్తిలో అత్యంత ప్రతిభ కనబరుస్తూ, భారతరత్న అంబేద్కర్ గారి ఆశయ సాధన కోసం మరియు మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఇందిరా ప్రియదర్శిని సేవలు అభినందనీయమని, అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళోజి నంది అవార్డును స్వీకరించడం, వారు మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే గర్వకారణమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, కవి, సినీగీత రచయిత, గాయకులు, సమాజసేవకులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. 21 09 2026 నాడు స్థానిక చుంచుపల్లి లోని సంఘ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఇటీవల వరంగల్లోని కాళోజి ఆడిటోరియంలో సుప్రసిద్ధ ప్రజాకవి, సంఘసంస్కర్త ,స్వాతంత్ర సమరయోధుడు స్వర్గీయ కాళోజి జయంతి సందర్భంగా ఉత్తమ ప్రతిభతో, విశిష్ట న్యాయవాద సేవలను అందిస్తున్నందుకుగాను స్థానిక ఫ్యూన్ బస్తీకి చెందిన ప్రముఖ అంబేద్కర్ వాది మరియు సామాజిక వాది ఉల్లోజు వెంకట్ సతీమణి, జూనియర్ న్యాయవాది శ్రీమతి పి ఇందిరా ప్రియదర్శిని హైకోర్టు జడ్జి గారి చేతుల మీదుగా బెస్ట్ జూనియర్ అడ్వకేట్ తో పాటు, ప్రతిష్టాత్మక కాళోజీ నంది అవార్డును కూడా స్వీకరించడం పట్ల హర్షం ప్రకటిస్తూ భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం మరియు బృందం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందించి మెమొంటోను బహుకరించారు.ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ,సన్మాన గ్రహీత పి ఇందిరా ప్రియదర్శిని ఆమె భర్త ఉల్లోజు వెంకట్ లతో బాటు బృందం కమిటీ రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ అంబేద్కర్ వాది దాసరి రమేష్, బృందం రాష్ట్ర గౌరవ సలహాదారులు రిటైర్డ్ సింగరేణి జిఎం శనగ వెంకటేశ్వర్లు, బరగడి దేవదానం గారు, కో కన్వీనర్లు శెట్టి కమలాకర్ , బూర్గుల కరుణాకర్,కోర్ కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశ్వర్లు తలారి కిషోర్ బాబు, అంబేద్కర్ సంఘం నాయకులు దేవదాసు ,రాజేశ్వరరావు, శివ లు పాల్గొన్నారు.

# కోదాడ మండలం గుడిబండ గ్రామ వాసి అన్నెపంగు బాబుకు 'ఉత్తమ సేవా పురస్కారం




**కోదాడ, సెప్టెంబర్ 21(భద్రాద్రి న్యూస్ ):** రక్తదానం చేసి ఎందరికో ప్రాణదాతలుగా మారిన రాష్ట్రంలోని రక్తదాతల సంకల్పాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడమే 'భారత రక్తదాన సేవ మిషన్ అసోసియేషన్' ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. "అమ్మ ఒక్కసారే రక్తం ధారపోసి జన్మనిస్తే, మా రక్తదాతలు ప్రతి మూడు నెలలకి ఒకసారి రక్తాన్ని అందిస్తూ బాధితులకు మళ్ళీ ఊపిరి పోసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు" అని కొనియాడారు. అలాంటి నిస్వార్థమైన రక్తదాతలను గుర్తించి, వారిని అభినందించడం మరియు గౌరవించడం కోసమే ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు.గుడిబండ వాసికి ఘన సన్మానం:ఇందులో భాగంగానే, కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన సీతారాములు, భారతమ్మ దంపతుల కుమారుడు అన్నెపంగు బాబు సేవలను సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. ఇప్పటివరకు 14 సార్లు రక్తదానం మరియు 5 సార్లు ప్లేట్‌లెట్స్ అందించి ఎందరో ప్రాణాలను కాపాడిన బాబు నిరుపమాన సేవలను గుర్తిస్తూ 'భారత రక్తదాన సేవ మిషన్ అసోసియేషన్' తరపున ఆయనకు 'ఉత్తమ సేవా పురస్కారం' అందించి ఘనంగా సత్కరించారు.తమ గ్రామానికి చెందిన యువకుడు ఇంతటి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకోవడం పట్ల గుడిబండ గ్రామ ప్రజలు, పలువురు ప్రముఖులు అన్నెపంగు బాబుకు అభినందనలు తెలియజేశారు.

# పండుగలు సామరస్యానికి ప్రతీకలు

**- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** పండుగలు సామరస్యానికి ప్రతీకలు. ఐక్యతతోనే సమాజ పురోగతి సాధ్యం.ఆధ్యాత్మిక భావన సన్మార్గం చూపుతుంది.యువతలో సామాజిక చైతన్యం అభినందనీయమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పండుగలు సమాజంలో సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకలుగా నిలుస్తాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం, రామాటాకీస్ ఏరియా, పాతకొత్తగూడెం, బూడిదగడ్డ తదితర ప్రాంతాలలో వివిధ ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ఆయన సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కులమతాల అంతరాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు పరోపకార గుణాన్ని, పేదలకు సాయపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యావంతులై సామాజిక చైతన్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గంలోని ప్రతీ సమస్య పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మండపాల నిర్వాహకులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, బండి నర్సింహా, విసంశెట్టి విశ్వేశ్వరరావు, సునీత, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, సాంబిరెడ్డి, మల్లేష్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డీజే మోత వద్దు.. భక్తి చాటే వేడుకలే ముద్దు

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**- డీజే ఏర్పాటు చేస్తే సీజ్‌తో పాటు కేసులు నమోదు చేస్తాం: ఎస్సై బైరు గోపి**




**కారేపల్లి, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కారేపల్లి ఎస్సై బైరు గోపి సూచించారు. ఉత్సవాల పేరుతో డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, ప్రశాంతతకు భంగం కలిగించే డీజేలకు అనుమతి లేదని తేల్చిచెప్పారు. డీజే శబ్దాల వల్ల ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు. ఉత్సవ కమిటీలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. భక్తి కార్యక్రమాలను ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలి తప్ప, అధిక శబ్దాలతో ఇతరులకు అసౌకర్యం కలిగించకూడదని సూచించారు.

**డీజే పెడితే కఠిన చర్యలు:**

నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డీజే ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే డీజే యజమాని, నిర్వాహకులు, సంబంధిత కమిటీ బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై బైరు గోపి హెచ్చరించారు. డీజే పరికరాలను సీజ్ చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. "ఉత్సవాలు ఆనందంగా జరగాలి.. కానీ ఇతరులకు ఇబ్బంది కలిగేలా ఉండకూడదు. ప్రతి ఒక్కరి భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత. పోలీసుల సూచనలకు సహకరిస్తూ గణేష్ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి" అని ఎస్సై బైరు గోపి కోరారు. డీజే మోతకు దూరంగా.. భక్తి భావంతో వినాయక వేడుకలు నిర్వహిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విజయవంతంగా అత్యవసర శస్త్రచికిత్స

**- ముఖం, మెడ, చెవి వద్ద తీవ్ర గాయాలకు సకాలంలో వైద్య సేవలు**




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** పదునైన వస్తువుతో దాడికి గురైన వ్యక్తికి కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విజయవంతంగా అత్యవసర శస్త్రచికిత్స.ముఖం, మెడ, చెవి వద్ద తీవ్ర గాయాలకు సకాలంలో వైద్య సేవలు అందించారు. కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పదునైన వస్తువుతో దాడికి గురైన 45 సంవత్సరాల వ్యక్తికి వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. శనివారం రాత్రి 11:30 గంటలకు తీవ్ర గాయాలతో క్యాజువాలిటీకి వచ్చిన రోగికి ముఖం, మెడ, కుడి చెవి ప్రాంతాల్లో లోతైన గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే అత్యవసర వైద్య సేవలు ప్రారంభించి, సీనియర్ రెసిడెంట్ డా. ఫరూక్ స్టాఫ్ నర్సుల సహకారంతో లోకల్ అనస్తీషియా కింద గాయాలకు కుట్లు వేయడంతో పాటు కుడి చెవికి రిపేర్ చేశారు. డా. రమేష్, అనస్థీషియా విభాగం, శస్త్రచికిత్సతో పాటు శస్త్రచికిత్స అనంతర క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా పాల్గొన్నారు. చీఫ్ సర్జన్, జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాంప్రకాష్ చిటిమళ్ల పర్యవేక్షణలో వైద్య బృందం సమన్వయంతో అత్యవసర చికిత్స అందించింది. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులు, అనస్థీషియా విభాగం, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధామోహన్ అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ఇలాంటి క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు, క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన వైద్య వసతులు, సేవలను బలోపేతం చేయడంలో సహకరిస్తున్న జిల్లా కలెక్టర్ అంకిత్‌కు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కొత్తగూడెం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తాటి చెట్లను లాటరీ ద్వారా పంచుకుంటున్న కొమినేపల్లి గౌడ సంఘ సభ్యులు



**కామేపల్లి,సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** ప్రతి ఏడాది ఇదే నెలలో మండలంలోని కొమ్మినేపల్లి గౌడ సంఘ సభ్యులు తమ గ్రామంలో ఉన్న తాటి చెట్లను లాటరీ (హుండీలు)ద్వారా పంచుకుంటారు. సోమవారం గ్రామంలోని తాటి వనంలో ఉన్న కంఠమహేశ్వర స్వామి గుడి వద్ద జరిగిన సమావేశంలో గ్రామంలోని గౌడ సభ్యులు,నాయకులు అందరూ కలిసి పాల్గొని చిట్టీలు హుండీలో వేసుకొని దాని ద్వారా తాటి చెట్లను పంచుకున్నారు.ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ మాసంలో సంఘ సభ్యులు అందరూ కుల దేవుడైన కంఠమహేశ్వర స్వామి గుడి వద్ద సమావేశం అయ్యి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు.చిన్న, పెద్ద తేడా లేకుండా గీత పని వాళ్ళందరూ ఈ సమావేశంలో పాల్గొని హుండీలో చిట్టీలు వేసుకొని తాటి చెట్ల పంపకాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా గౌడ సంఘం సభ్యుల సమస్యలను కూడా ఈ సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ పెద్దలు మేకపోతుల రామ్మూర్తి గౌడ్, సూతగాని వీరన్న గౌడ్,బొమ్మగాని పిచ్చయ్య గౌడ్, సూతగాని వెంకటేశ్వర్లు గౌడ్, బుడిగే ఉపేందర్ గౌడ్,సురభి నారాయణ గౌడ్, మంగయ్య గౌడ్ , బోనేపల్లి బాబు గౌడ్,వెంకన్న గౌడ్, మంగయ్య గౌడ్ దొంతు భిక్షం గౌడ్ పబ్బతి నాగేశ్వరావు గౌడ్, కాంపాటి రామ్మూర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాత గుడిబండ ఎస్సీ కాలనీలో వైభవంగా గణేష్ నవరాత్రి అన్నదాన కార్యక్రమం





**కోదాడ, సెప్టెంబర్ 21(భద్రాద్రి న్యూస్ ):** కోదాడ మండల పరిధిలోని పాత గుడిబండ ఎస్సీ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మదర్ ఇండియా యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శరబయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఒ. శ్రీనివాసరెడ్డి, మట్టా కృష్ణారెడ్డి, ఇర్ల నరోత్తమ్ రెడ్డి, చింతా అనంతరామిరెడ్డి, చింతా సత్యమారెడ్డి, రిటైర్డ్ ఏఎస్ఐ పులి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పులి శ్రీను హాజరయ్యారు. అదేవిధంగా బీజేపీ నాయకులు రాధాకృష్ణ, మాజీ ఎంపీపీ కవితారాదా రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మదర్ ఇండియా యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అన్నదాన కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు, గ్రామ ప్రజలకు మరియు విజయవంతం చేసిన నాయకులకు, కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడంతో కార్యక్రమం ఎంతో విజయవంతంగా ముగిసింది.

# చర్లలో సర్వేయర్ కరువు.. రైతులకు భూ కష్టాలు!

**- భూముల హద్దులు తేల్చేదెవరు..? సర్వే చేయించుకునేదెప్పుడు..?**
**- ప్రత్యేక సర్వేయర్‌ను వెంటనే నియమించాలి.. కలెక్టర్‌కు రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు వినతి**

**చర్ల, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** చర్ల మండలంలో సర్వేయర్ లేకపోవడంతో రైతుల భూ సమస్యలు రోజురోజుకూ పెండింగ్‌లో పడుతున్నాయని రైతు క్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. భూముల హద్దుల నిర్ధారణ, సర్వేలు, భూ విభజనలు వంటి కీలక పనులకు సర్వేయర్ అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్ల మండలానికి ప్రత్యేక సర్వేయర్‌ను వెంటనే నియమించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అంకిత్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. మండలంలో సర్వేయర్ లేకపోవడంతో చిన్నచిన్న భూ సమస్యల పరిష్కారం కోసం కూడా రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. భూముల హద్దులు నిర్ధారించుకోవడం, సర్వేలు చేయించుకోవడం, విభజనలు తదితర పనులు సకాలంలో జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వేయర్ కొరతతో రైతుల భూ సమస్యలు పెండింగ్‌లో పడటం ఆందోళనకరమైన విషయమని, హద్దుల విషయంలో స్పష్టత లేకపోవడం భవిష్యత్‌లో భూ వివాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పనుల కోసం ఇతర ప్రాంతాల అధికారులపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా చర్ల మండలానికే ప్రత్యేక సర్వేయర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ అంకిత్ దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను పరిశీలించి చర్ల మండలానికి సర్వేయర్‌ను నియమించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆంజనేయులు తెలిపారు. మండలంలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరించాలని ఆయన కోరారు. సర్వేయర్



నియామకంతో భూముల సర్వేలు, హద్దుల నిర్ధారణ, భూ విభజన వంటి పనులు వేగవంతమై రైతులకు ఉపశమనం కలుగుతుందని అన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంతో పాటు రైతుల తరఫున నిరంతరం పోరాడుతానని కొత్తపల్లి ఆంజనేయులు స్పష్టం చేశారు.

# విద్యా, సాంకేతిక అభివృద్ధికి కార్పొరేట్ సంస్థల సహకారం అభినందనీయం

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి తోడ్పాటులో భాగంగా కరూర్ వైశ్య బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమం కింద రూ.5,63,509 విలువైన 25 లెనోవో ట్యాబ్‌లను జిల్లా కలెక్టర్ అంకిత్‌కు సోమవారం అందజేశారు. విద్యార్థులకు డిజిటల్ వనరులను అందుబాటులోకి తీసుకురావడం, విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ట్యాబ్‌లను అందించినట్లు బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న కరూర్ వైశ్య బ్యాంక్ యాజమాన్యానికి జిల్లా కలెక్టర్ అంకిత్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్య, ఆరోగ్యం తదితర ప్రజోపయోగ కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు తమ జూ= నిధుల ద్వారా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్య బ్యాంక్ తెలంగాణ నార్త్ డివిజనల్ హెడ్ కిషోర్ వర్మ యువికె, చీఫ్ మేనేజర్ బాలాజీ నడిపల్లి, కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ఎస్. సురేష్, మేనేజర్ ఎం.డి. ఖుద్దూస్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జె. సునీత తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్ ):** గొల్లపూడి వృద్ధాశ్రమం నందు వివిధ కారణాల చేత ఆశ్రమం నందు ఆశ్రయాన్ని పొందుతున్న వృద్ధులకు అవసరమైన దుస్తులను జీవి మాల్ వారి విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం శ్రీనివాసరావు సీతా గార్ల సహకారంతో అందజేసినట్లు లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేంద్రరావు అన్నారు. పలు సందర్భాల్లో విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని గొల్లపూడి వృద్ధాశ్రమం నందు వృద్ధులకు దుస్తులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కొల్లా రాంబాబు కార్యదర్శి కొదుమూరు రవి డిస్టిక్ చైర్పర్సన్ నూకల ప్రసాదు, మిట్టపల్లి శ్రీమన్నారాయణ ఆశ్రమ నిర్వాహకులు నరసింహారావు కవిత, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# తిప్పాపురం మీదుగా పశువుల తరలింపు.. అధికారులు మేల్కొనేదెప్పుడు?

**- పగలు, రాత్రి తేడా లేకుండా రవాణా జరుగుతోందన్న ఫిర్యాదులు.. అనుమతులు, పత్రాలు తనిఖీ చేసేదెవరు?**
**- నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేసి బాధ్యులపై కేసులు పెట్టాలి.. మాజీ సర్పంచ్ కారం కన్నారావు డిమాండ్**

**చర్ల , సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):**
తిప్పాపురం గ్రామం మీదుగా ఛత్తీస్‌గఢ్ నుంచి ఆవులు, గేదెలు తదితర పశువులను తరలిస్తున్న ఘటనలపై అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించాలని మాజీ సర్పంచ్ కారం కన్నారావు డిమాండ్ చేశారు. పశువుల రవాణాపై స్థానికంగా ఫిర్యాదులు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ సంబంధిత శాఖలు సమగ్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పశువులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలించే సమయంలో అవసరమైన అనుమతులు, రవాణా పత్రాలు, పశువుల ఆరోగ్య ధ్రువపత్రాలు, రవాణా నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించడం కాకుండా, తిప్పాపురం మార్గంలో నిరంతర నిఘా ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేయాలని కోరారు.

**ఫిర్యాదులు వస్తున్నా.. తనిఖీలు ఎక్కడ?**
తిప్పాపురం మీదుగా పశువుల రవాణాపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని కారం కన్నారావు అన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే పశువుల వాహనాలపై నిఘా పెంచాలని డిమాండ్ చేశారు.
పశువులను నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో వాహనాల్లో ఎక్కించడం, తగిన రవాణా సౌకర్యాలు లేకుండా తరలించడం, అవసరమైన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిబంధనల ఉల్లంఘన బయటపడితే వాహనాలను నిలిపివేయడంతోనే వ్యవహారాన్ని ముగించకుండా, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అధికారుల నిఘా లేకపోతే అక్రమ రవాణాకు అవకాశం!**
ప్రధాన రహదారులపై పశువుల వాహనాల తనిఖీలు క్రమం తప్పకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనుమతులు, పత్రాలు సక్రమంగా ఉన్నాయా? పశువులను నిబంధనలకు అనుగుణంగా తరలిస్తున్నారా? వాహనంలో పరిమితికి మించి పశువులను ఎక్కించారా? అనే అంశాలపై ప్రతి వాహనాన్ని పరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజలు అనుమానాస్పద రవాణాపై సమాచారం అందించినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని అన్నారు. ఫిర్యాదులను పట్టించుకోకుండా వదిలేస్తే నిబంధనల ఉల్లంఘనలకు అవకాశం ఏర్పడుతుందని హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యానికి తావులేకుండా తిప్పాపురం మార్గంలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించొద్దు**
పశువుల రవాణాలో చట్టపరమైన నిబంధనలు ఉల్లంఘించినట్లు తనిఖీల్లో తేలితే సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకుని, రవాణాదారులు, వాహన యజమానులు తదితర బాధ్యులపై





చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కారం కన్నారావు డిమాండ్ చేశారు. పశువుల సంక్షేమం, రవాణా నిబంధనలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. తిప్పాపురం మీదుగా పశువుల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి.. తనిఖీలు ముమ్మరం చేసి.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు అధికారులు వెనక్కి తగ్గకూడదని ఆయన స్పష్టం చేశారు.

# గణనాథుడే ప్రకృతి స్వరూపం

**- మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లి బాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్ ):** కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని కొత్త కాలనీ సెంటర్ లో మహా అన్నదాన కార్యక్రమాన్ని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు ప్రారంభించారు. అంతకుముందు గణనాథుని వద్ద పూజలు చేశారు. మహా అన్నదాన దాత ఉస్మాన్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు షేక్ రబ్బానీ పాషా- మీరాభి మరియు గణపతి నవరాత్రి ఉత్సవాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్ ధరావత్ అనురాధ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు అభినందించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గణపతి అంటేనే ప్రకృతి స్వరూపమని, ప్రత్యేక పూలు కావాలని పూజ చేయాలని లాంటి నియమాలు లేవని మనకు కనిపించే ప్రతి చెట్ల ఆకులతోనూ మొక్కలతోనూ, గణపతిని పూజించవచ్చని, అందుకే మట్టితో తయారైన గణనాథుడు నవరాత్రుల తర్వాత మళ్లీ గంగమ్మ ఒడిలోకి వెళ్లడం అంతేకాకుండా బుద్ధిలో వినయంలో గణనాథుని మించిన దేవతలు లేరని పురాణాలు చెబుతున్నాయి. మహా శరీరంతో ఉన్నప్పటికీ, వినయ విధేయతలతో తన తల్లిదండ్రులను మెప్పించి దేవతల అందరికంటే ముందు పూజలు అందుకుంటున్నాడు. అందరకు అగ్రగామిగా నిలిచాడు. గణనాథుని సేవించడం వలన సర్వ విఘ్నాలు తొలగిపోతాయని శాస్త్రాలు చెబుతున్నాయని మల్లి బాబు యాదవ్ తెలిపారు. గణపతి సేవలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆ వినాయకుని ఆశీర్వాదాలు ఎల్లప్పటికీ ఉండాలని, గణనాథుని ఆశీర్వాదం వలన గ్రామాలు పల్లెలు, ప్రతి కుటుంబం పచ్చగా, పచ్చని పైరులతో పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటున్నట్లు, అదేవిధంగా ఇల్లందు ఎమ్మెల్యే అన్న కోరం కనకయ్య ఆశీస్సులతో గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేటట్లు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు మీరాబి, చంద్రు, కొమ్మినేని పుల్లయ్య మొగిలి శ్రీను ఉప్పుగంట వీరభద్రరావు, శీలం పుల్లయ్య దేరంగుల తిరుపయ్య, పాటిబండ్ల ప్రసాదు భూక్యా నాగేంద్రబాబు తురక బిక్షం రాయల నాగ శంకర్, మంజుల వెంకన్న, చల్ల మల్లయ్య బానోతు లక్ష్మ,బాదావత్ నాగరాజు, మరియు భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం శ్రీ సంత్ సేవాలాల్ ఆలయంకు స్థలము నిధులు మంజూరు చేయాలి

**- గిరిజన నాయకుడు బాదాత్ శీను నాయక్**
**- గ్రామ మాజీ సర్పంచ్ అజ్మీర రాందాస్ నాయక్**
**- రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం కి విజ్ఞప్తి**
**- మండల పరిషత్ అభివృద్ధి అధికారి సోమలాల్ కు వినతి పత్రం అందజేత**

**కామేపల్లి,సెప్టెంబర్ 21(భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండలం కేంద్రంలో శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన. ప్రజావాణిలో వినతి పత్రం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ధారావత్ సోమలాల్ కి అందించడం జరిగింది ఈ సందర్భంగా బాదావత్ శ్రీను నాయక్ అజ్మీర రాందాస్ నాయక్ జరపలా రామ్ సింగ్ నాయక్ మాట్లాడుతూ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మించుటకు మండల కేంద్రంలో స్థలం ఏర్పాటు చేయాలని. రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా అధికారులు మండల అధికారులను ప్రజావాణి లో దరఖాస్తు చేస్తూ బాదావత్ శ్రీను నాయక్ విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజక వర్గం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన కామేపల్లి మండలం లో 24 గ్రామపంచాయతీలో గిరిజన లంబాడీలు అధికంగా శాతం ఉన్న ఏజెన్సీ మండలంలో గిరిజన లంబాడి ప్రజలు వారి సాంస్కృతి సాంప్రదాయాలను అనుకూలంగా ప్రకృతిని కొలుచుకునే భక్తి భావాలతో ఆదేత్య దైవంగా ఆదరించే విధంగా ఉన్న వారి ఆధ్యాత్మిక సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయం లేకపోవడం చాలా బాధాకరం మనీ వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా మండల జిల్లా అధికారులు స్పందించి.మండల కేంద్రంలో శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మాణం కోసం స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మీ కోరారు ప్రతివేత ఫిబ్రవరి 15 నుండి 22 వరకు జరుపుకునే జయంతిలో భాగంగా స్థానిక ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ ఇప్పటికి కొనసాగుతున్న ఎంపీ కోరిక బలరాం నాయక్ ఎన్నిసార్లు విన్నవించిన జయంతి రోజుసభలకే పరిమితమవుతున్నారు కానీ ఎవరు పట్టించుకునే నాధుడు లేరని వారు మండిపడ్డారు ఇంకైన ఇప్పటికీ స్పందించి వచ్చే ఫిబ్రవరి 15 జయంతి కల్లా ఆ స్థలంలో ఏర్పాటు చేసుకునే మహా జయంతి సభకు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజాప్రతినిధులు చొరచూపాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల 24 గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసుకొని యువతి యువకులను ప్రజలను జాతి ఉనికి కోసం




కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించుటకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వడంతో మండల సంబంధిత అధికారులకు ప్రతి సోమవారం ప్రజల నుండి వస్తున్న దరఖాస్తు పరిష్కరించాలని తక్షణమే శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మించుటకు స్థలము నిధులు మంజూరుకై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని బాధావత్ శ్రీను నాయక్ విజ్ఞప్తి చేశారు. జరపల రామ్ సింగ్ అజ్మీర రాందాస్ కలిసి అధికారులకు ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వడం జరిగింది లంబాడీల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ మేరమ్మ దండియాడి లా ఆలయం నిర్మాణం కు స్థలం నిధులు మంజూరు చేసే విధంగా.చెపట్టాలని అధికారులను కలిసి మెమోరం ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో అజ్మీర కృష్ణ కిట్టు ప్రేమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి వేదజ్ఞ అదాలత్ సమర్పించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**ఖమ్మం ,సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్):** ఖమ్మం, మామిళ్ళగూడెం లో నీ శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 20 సెప్టెంబర్ 2026 నాడు 25 వ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో లో భాగం గా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారి ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ?ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శివ కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, వైభవంగా జరిగిన ఈ కల్యాణ వేడుకను దర్శించి భక్తులు తారకనావం స్మరణతో మునిగితేలారు. కల్యాణోత్సవం అనంతరం కమిటీ నిర్వాహకులు భక్తులందరికీ భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు భక్తులు ఈ ప్రసాదాన్ని స్వీకరించారు.



**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:**
సాయంత్రం వేళల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ప్రత్యేకించి చిరంజీవి వేదజ్ఞ అదాలత్ సమర్పించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ‘హార్వెస్ట్’ విద్యార్థులు

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్ ):-** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు ఆదివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి అండర్ 14 మరియు అండర్ 17 (సింగిల్స్) విభాగాలకు దాదాపు 150 మంది విద్యార్థినీ, విద్యార్థులు అదేవిధంగా టీం ఈవెంట్కు దాదాపు 50 పాఠశాలలు హాజరవగా తమ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు కూడా పాల్గొనడం జరిగిందని ‘హార్వెస్ట్’ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం ‘సోమవారం’ తెలిపారు. టీమ్ ఈవెంట్ అండర్ 14 విభాగంలో ఎ. ఉజ్వల్ (9వ తరగతి), ఎ.యశ్వంత్ (6వ తరగతి), చేతన్ (8వ తరగతి) అలాగే అండర్ 17 విభాగాలలో టి. అఖిలేష్ (9వ తరగతి), ఎస్.జ్ఞాన శౌరి (11వ తరగతి) సిల్వర్ మెడల్స్ ను కైవసం చేసుకోవడం జరిగింది. అదే విధంగా సింగిల్స్ విభాగంలో పి.వర్షిక (7వ తరగతి), ఎ.ఉజ్వల్ (9వ తరగతి), ఎ.యశ్వంత్ (6వ తరగతి), టి.అఖిలేష్ (9వ తరగతి) లు మంచి ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవడం గర్వకారణమని హార్వెస్ట్ పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్ గారు, ప్రిన్సిపల్ ఆర్. పార్వతిరెడ్డి గారు అన్నారు. జిల్లా స్థాయి పోటీలలో గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు డి.వై.ఎస్.ఓ. టి.సునీల్ రెడ్డి గారు అలాగే జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి వైరామారావు గారు బహుమతులు అందజేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా ‘హార్వెస్ట్’ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవి మారుత్ గారు, ప్రిన్సిపల్ ఆర్. పార్వతి రెడ్డి గారు మాట్లాడుతూ ఎస్. జి.ఎఫ్ గేమ్స్ లో విజేతలయిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందిస్తూ పోటీతత్వాన్ని పెంపొందించడానికి చదువుతోపాటు ఇతర క్రీడాంశాలకు కూడా తగిన ప్రాధాన్యాన్ని ఇస్తూ జాతీయ వేదికలపై హార్వెస్ట్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులను నిలిపేలా వారికి ప్రత్యేక శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన శిక్షకులచే శిక్షణ ఇప్పించడం వల్లనే వెళ్ళిన ప్రతీచోట పతకాలు సాధిస్తున్నామని, విద్యార్థులను విజేతలుగా



నిలపడమే లక్ష్యంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా రాణించి మంచి ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకుని ఆకాంక్షించారు. వీరికి శిక్షణ ఇచ్చిన టేబుల్ టెన్నిస్ కోచ్ అలీ గారిని అభినందించారు.

# టియూడబ్ల్యూజె వైద్యశిబిరం విజయవంతం

- శిబిరాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి
- ఇలాంటి క్యాంపులు జర్నలిస్టులకు చాలా అవసరం: ఎమ్‌డి ఖాదర్‌బాబా
- ప్రెస్ క్లబ్ కృషి.అభినందనీయం: కె.రాం నారాయణ





**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్ ):** టియూడబ్ల్యూజె(ఐజెయూ) ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమ వారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఖమ్మంలోని యశోద క్లీనిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి ఖాదర్‌బాబాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిపిఆర్ఓ ఎం.ఏ గౌస్, టియూడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభం అనంతరం అదనపు కలెక్టర్ పరీక్షలు చేయించుకున్నారు. అనేక ఒత్తిడుల మధ్య పని చేస్తున్న జర్నలిస్టులకు ఇలాంటి వైద్య శిబిరాలు అవసరమని అభిప్రాయపడ్డారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి ఖాదర్‌బాబా మాట్లాడుతూ అనేక ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కారణవవుతున్న జర్నలిస్టుల తమ పని బాధ్యతల్లో పడి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, ఇలాంటి శిబిరాలు నిర్వహించడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉందని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, బోన్ పరీక్షలు, ఈసిజి, షుగర్, ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. యశోద హాస్పటల్ సోమాజిగూడ వైద్యులు డాక్టర్ శ్రీ హర్ష జిఆర్ , డాక్టర్ మురళీ, డాక్టర్ కీర్తి కృష్ణ వైద్యసేవలందించారు. జర్నలిస్టు కుటుంబ సభ్యులు విరివిగా పాల్గొని ఉచిత వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎం.భూపాల్, యూనియన్ రాష్ట్ర నాయుకులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మోహిద్దీన్, పసపులేటి సత్యనారాయణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, కోశాధికారి పిన్ని సత్యనారాయణ, నగర కమిటీ కోశాధికారి ఏలూరి వేణు, పలువురు జిల్లా, నగర, ప్రెస్‌క్లబ్ నాయకులతో పాటు యశోద క్లీనిక్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి ప్రత్యేక ట్రాఫిక్ మార్గాలు

- ధంసలాపురం చెరువు వైపు విగ్రహాల రాకపోకలకు మార్గాల నిర్దేశం
- నిమజ్జనం అనంతరం తిరుగు ప్రయాణం వన్‌వే.. ప్రజలు సహకరించాలి




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** వినాయక నిమజ్జనం సందర్భంగా ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురం చెరువు వద్దకు గణేష్ విగ్రహాలు చేరుకునేందుకు, అలాగే నిమజ్జనం అనంతరం ప్రజలు, వాహనాలు తిరిగి వెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ మార్గాలను నిర్దేశించారు. నిమజ్జనం సజావుగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జరిగేలా ఈ మార్గాలను ఏర్పాటు చేసినట్లు పీఆర్వో తెలిపారు.

**నిమజ్జనానికి వెళ్లే మార్గాలు ఇలా..**

రూరల్ మండలం వైపు నుంచి వచ్చే విగ్రహాలు: రాపర్తి నగర్, బీసీ కాలనీ, కూరగాయల మార్కెట్, ఆర్ఆర్ స్కూల్ ఏరియా, కొత్త బస్టాండ్, సాయిబాబా ఆర్చ్, ఆర్టీఏ కార్యాలయం, బ్యాంక్ కాలనీ, వికలాంగుల కాలనీ, బల్లేపల్లి, ఖానాపురం, టేకులపల్లి, న్యూ విజన్ కాలేజ్ వైపు నుంచి వచ్చే గణేష్ విగ్రహాలు బైపాస్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ చేరుకుని అక్కడి నుంచి ఇల్లందు ఎక్స్ రోడ్, ప్రభుత్వ ఆసుపత్రి, జడ్పీ సెంటర్, చెరువు బజార్, బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, ముస్తాఫ్ నగర్, సంబానినగర్, రాఘవ మెడికల్స్, శ్రీరామ్ హిల్స్ మీదుగా ధంసలాపురం చెరువు నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.

పంపింగ్ వెల్ రోడ్, గాంధీనగర్, మోతీనగర్, పీఎస్ఆర్ రోడ్, గాంధీచౌక్, సారథినగర్, బొక్కలగడ్డ వైపు నుంచి వచ్చే వాహనాలు: నయాబజార్ నుంచి జూబ్లీ క్లబ్, మయూరి సెంటర్ మీదుగా వెళ్లాలి.

మామిళ్లగూడెం, బురాన్‌పురం, బస్ డిపో, కమాన్ బజార్, కస్బా బజార్ వైపు నుంచి వచ్చే వాహనాలు: కిన్నెర సెంటర్, జడ్పీ సెంటర్, చెరువు బజార్, చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.

శ్రీశ్రీ సర్కిల్, శ్రీనగర్ కాలనీ, రోటరీ నగర్, ఇందిరానగర్, పాత మమతా మెడికల్ కాలేజీ, మమత ఎక్స్ రోడ్, కవిరాజ్ నగర్, పాత కలెక్టరేట్ బ్యాక్ ఏరియా నుంచి వచ్చే విగ్రహాలు: గట్టయ్య సెంటర్, బ్యాంక్ కాలనీ, వీడియోస్ కాలనీ మీదుగా ఇల్లందు ఎక్స్ రోడ్, జడ్పీ సెంటర్ చేరుకుని చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్‌కు వెళ్లాలి.

వెంకటగిరి ఎక్స్ రోడ్, శ్రీనివాస నగర్, గ్రెయిన్ మార్కెట్, ప్రకాష్ నగర్, గుట్టల బజార్, జహీర్‌పుర తండా, అయ్యప్ప స్వామి ఆలయం ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు: మెయిన్ రోడ్డు మీదుగా చర్చి కాంపౌండ్ చేరుకుని అక్కడి నుంచి నిమజ్జనం పాయింట్‌కు వెళ్లాలి.

గొల్లగూడెం, మధురానగర్, రాఘవయ్య నగర్, మమతా కాలేజ్, హార్వెస్ట్ స్కూల్, అల్లిపురం, కొత్తగూడెం, అల్లిపురం ఎక్స్ రోడ్ నుంచి వచ్చే విగ్రహాలు: టాటా మోటార్స్ మీదుగా చెరువు బజార్, చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.

బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, మిషన్ హాస్పిటల్, ముస్తాఫా నగర్, సంబానినగర్, పరికముక్కల కాలనీ, శ్రీరామ్ నగర్, శ్రీరామ్ హిల్స్ నుంచి వచ్చే విగ్రహాలు: మెయిన్ రోడ్డు మీదుగా నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.

నిమజ్జనం అనంతరం తిరుగు ప్రయాణ మార్గాలు

నిమజ్జనం అనంతరం ప్రజలు, వాహనాలు నిమజ్జనం పాయింట్ నుంచి జయశంకర్ విగ్రహం వరకు చేరుకోవాలి. అక్కడి నుంచి ప్రకాష్ నగర్, శ్రీనివాస నగర్, జహీర్‌పుర తండా, అయ్యప్ప టెంపుల్, వెంకటగిరి ఎక్స్ రోడ్ వైపు వెళ్లేవారు ధంసలాపురం బ్రిడ్జి దాటి, బ్రిడ్జి కింది నుంచి ధంసలాపురం గ్రామం మీదుగా ఎస్వీఎం స్కూల్ వైపు వెళ్లి శ్రీనివాస నగర్, అయ్యప్ప టెంపుల్, ప్రకాష్ నగర్ వైపు చేరుకుని మెయిన్ రోడ్డు ద్వారా తమ గమ్యస్థానాలకు వెళ్లవచ్చు.

ముస్తాఫా నగర్, మమతా రోడ్, ఇల్లందు ఎక్స్ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, బల్లేపల్లి, మామిళ్లగూడెం, న్యూ బస్టాండ్, రాపర్తి నగర్, రూరల్ ప్రాంతాల వైపు వెళ్లేవారు జయశంకర్ విగ్రహం నుంచి శ్రీరామ్ హిల్స్, రాఘవ మెడికల్స్ వద్ద రోడ్డు క్రాస్ చేసి పరికముక్కల కాలనీ మీదుగా అల్లిపురం ఎక్స్ రోడ్ చేరుకోవాలి. అక్కడి నుంచి టాటా మోటార్స్, లకారం, మమత ఎక్స్ రోడ్ మీదుగా ఇందిరానగర్, శ్రీశ్రీ సర్కిల్ ద్వారా బైపాస్ చేరుకుని తమ గమ్యస్థానాలకు వెళ్లవచ్చు.

వన్‌వే ట్రాఫిక్‌కు సహకరించాలి

వినాయక నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే మార్గాల్లో కేవలం వన్‌వే ట్రాఫిక్‌ను మాత్రమే అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ట్రాఫిక్ మార్గదర్శకాలను పాటించి పోలీసులకు సహకరించాలని పీఆర్వో కోరారు.

## ఏఎస్సై గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్ ):-** వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన (11) పోలీస్ అధికారులు ఎస్.డి.జలీల్, జె.రవి, ఎస్.కె.ఖాసిం అలీ, కె.వెంకటేశ్వర రావు, కె.చెన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, బి.పిచ్చయ్య, జి.హరి, ఎస్.వెంకట కోటిరెడ్డి, ఆర్.కాళహస్తి, బి.పెద రాజేందర్ లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా కు బదిలీపై వెళ్ళనున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాద్ పాల్గొన్నారు.

## వరంగల్ విమానాశ్రయానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి



**కొత్తగూడెం అర్బన్ ,సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్ ) :-** వరంగల్ కేంద్రంగా బహుజన రాజ్య స్థాపన కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును వరంగల్‌లో నిర్మిస్తున్న నూతన విమానాశ్రయానికి నామకరణం చేసి ఆయనకు తగిన గౌరవం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రెవిన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను నరసింహారావు కోరారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు యాసారపు నర్సింహారావు కోరారు. పార్టీలకుఅతీతంగా గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును విమానాశ్రయానికి పెట్టేలా తగిన కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రూ.2వేలకు పైబడిన యూపీఐ చెల్లింపులను అనుమతించబోం

- మధ్యప్రదేశ్, పంజాబ్ పెట్రోల్ పంప్ డీలర్లు




**భోపాల్, సెప్టెంబరు 21:** అక్టోబరు 16 నుంచి రూ.2వేలకు పైబడిన యూపీఐ చెల్లింపులను అనుమతించబోమని పంజాబ్, మధ్యప్రదేశ్ పెట్రోల్ పంప్ డీలర్లు స్పష్టం చేశారు. నగదు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులకు అనుమతిస్తామని వెల్లడించారు. పెట్రోల్ విక్రయాల్లో తమ మార్జిన్ తక్కువగా ఉంటోందని, 0.4శాతం ఎండీఆర్ భరించలేమని వివరించారు.

# అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు.. మంత్రి తుమ్మల ఆదేశం
- సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలే లక్ష్యం.. 25 రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేయాలి







**ములకలపల్లి, సెప్టెంబర్ 21 (భద్రాద్రి న్యూస్):** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి పరిశీలించారు.

### టన్నెల్ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్‌లోగా పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

### అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల

అనంతరం ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలోని సీతారామ ఎత్తిపోతల పథకం మూడో పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహాన్ని పరిశీలించి, విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుమ్మరిపాడులో హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు ప్రారంభం

ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో రూ.4.63 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

### వర్షాభావ పరిస్థితుల్లో గోదావరి జలాల వినియోగం

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తక్కువ వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో భూగర్భ జలాలు తగ్గే పరిస్థితి ఉందని, ఖరీఫ్ పంటలను కాపాడేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని, ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంతో పాటు విద్యుత్ రంగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. నీటి నిల్వలు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరగవచ్చని వివరించారు. అందువల్ల నీటి లభ్యత, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.

### భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు

సత్తుపల్లి ట్రంక్‌కు నీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అదనపు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిర్మాణ, సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

### ఆయిల్‌పామ్ సాగుకు సాగునీటి సౌకర్యం

సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి చెప్పారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున నీటి లభ్యతను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు సీతారామ జలాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధాన కాలువలతో పాటు అవసరమైన చోట పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గడంతో పాటు నీటిని నేరుగా రైతుల పొలాలకు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించి, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చని వివరించారు.

### వారానికోసారి పనులపై సమీక్ష

సీతారామ ప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు ఎక్కడా నిలిచిపోకూడదని, సమస్యలు తలెత్తితే జిల్లా స్థాయిలోనే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు.

### రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని మంత్రి తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. పాండురంగాపురం--మణుగూరు రైల్వే మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, వర్షాలపై మాత్రమే ఆధారపడే పరిస్థితి తగ్గి సాగునీటి భరోసా పెరుగుతుందని మంత్రి తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో రాజ్యాధికార పార్టీకి నూతన కార్యవర్గం

**- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ నిధులు పూర్తిగా వారికే ఖర్చు చేయాలి: గట్ల రాజన్న**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్):**
తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఖమ్మం జిల్లాలో క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి గట్ల రాజన్న తెలిపారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు దామల్ల సత్యం ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం నగరంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గట్ల రాజన్న ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

**-పలువురికి పార్టీ పదవులు**

ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత విస్తృతం చేసే లక్ష్యంతో నూతన బాధ్యతలను ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పెరమాలపల్లి నాగార్జున, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలూరి వినయ్, ఖమ్మం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా తెల్లాపుట్ట జగపతి బాబు, జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా తెల్లూరి జితేందర్, ఖమ్మం నగర అధ్యక్షుడిగా కొప్పుల రామారావు, డివిజన్ కార్యదర్శులుగా రామకృష్ణ, రాజులను నియమిస్తూ సాధరంగా ఆహ్వానించి, అభినందించి పార్టీ కండువాను కప్పి బాధ్యతలను అప్పగించారు.

**-ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం**

ఈ సందర్భంగా గట్ల రాజన్న మాట్లాడుతూ... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కేటాయించే బడ్జెట్ నిధులు పూర్తిస్థాయిలో ఆయా వర్గాల సంక్షేమానికే వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోని వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలబడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి పట్టణ, మండల, జిల్లా స్థాయి వరకు పటిష్టంగా నిర్మించేందుకు నూతనంగా నియమితులైన నాయకులు కృషి చేయాలని సూచించారు, జిల్లా అధ్యక్షులు దామల్ల సత్యం మాట్లాడుతూ... పార్టీపై నమ్మకంతో బాధ్యతలు స్వీకరించిన ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలతో మమేకమై పనిచేయాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని ప్రజా సమస్యలపై పనిచేసే బలమైన వేదికగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. అట్టడుగు వర్గాల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, నూతనంగా నియమితులైన బాధ్యులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# సర్ 2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డిలి**
**- ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి**
**- అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి**





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (భద్రాద్రిన్యూస్):-**
ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.
ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పీఓసీ కార్యాలయ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని, వాటిని వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు.
డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, విచారణ, పరిష్కార ప్రక్రియలను అక్టోబర్ చివరి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.
ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని ప్రక్రియలను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను అవసరమైన సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని తెలిపారు. ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లు ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా బీఎల్ఓలు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, బీఎల్ఏలను నోటీసుల పంపిణీలో భాగస్వాములను చేయరాదని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏల ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరఫున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని బీఎల్ఓలు సంబంధిత ఓటర్లు, వారి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్--2026లో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, చివరి దశలో పనులు పేరుకుపోకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఈఆర్ఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్నాలతో దద్దరిలిన గద్వాల



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు



రోడ్డుపై బైఠాయించి నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**వరి పంట రక్షణకై జమ్మిచెడు దగ్గర గద్వాల - కర్నూలు రహదారి దిగ్బంధం**

**జూరాల నీటి విడుదలకు డిమాండ్ చేస్తూ బిజెపి, బిఆర్ఎస్ నాయకులు, రైతుల ధర్నా**

**రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా అని మండిపాటు**

**24 గంటల్లో నీటిని విడుదల చేస్తామని అధికారుల హామీ**

**గద్వాల సెప్టెంబర్ 21:**
సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో నీరు అందక ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్ నుండి జమ్మిచెడు వరకు ర్యాలీగా వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిలదీశారు. జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయం రోడ్డు,జమ్మిచెడులో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి కర్నూల్ రోడ్డుపై బైఠాయించారు.గద్వాల - కర్నూలు ప్రధాన రహదారిపై బైఠాయించడంతో సుమారు అయిదు గంటలపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. జూరాల డ్యామ్ నుంచి తక్షణమే కుడి కాలువలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళన కార్యక్రమాలలో బిజెపి జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మరియు బిఆర్ఎస్ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు, నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి పాల్గొని మద్దతు తెలిపారు.బిజెపి నాయకురాలు డి.కె. స్నిగ్ధరెడ్డి మాట్లాడుతూ ..."గతంలో మహబూబ్ నగర్ ఎంపీ డి.కె. అరుణ నడిగడ్డలో రిజర్వాయర్లు ఏర్పాటు చేయించి నీటిని వదిలేందుకు అన్ని ఏర్పాట్లు చేసినా, నేడు రిజర్వాయర్లలో నీరు లేని పరిస్థితి దాపురించింది అని విమర్శించారు. రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే అధికారులు కాలువలకు చుక్కనీరు వదలడం లేదని మండిపడారు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పందించకపోగా వరి పంట ఎందుకు వేశారని ప్రశ్నించడం విచారకరం అని ఆవేధన వ్యక్తం చేశారు వారంలో కనీసం 3 రోజులు నీరు వదిలి పంటలను కాపాడాలని అధికారులను కోరారు.బిఆర్ఎస్ నాయకురాలు బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూ "తెలంగాణ రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి జూరాల నీటిని ఆంధ్రా ప్రాంతాలకు ఎలా తరలిస్తారు? జూరాల కుడి కాలువల గేట్లను ఎందుకు మూసివేశారో ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ నుండి జమ్మిచెడు వరకు ర్యాలీగా వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిలదీశాం. తక్షణమే జూరాల గేట్లు ఎత్తి చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వాలి అని వారు వారి డిమాండ్ చేశారు.

**24 గంటల హామీతో విరమణ**

సుమారు 5 గంటల పాటు కొనసాగిన ఈ ధర్నా వల్ల గద్వాల - కర్నూలు రహదారిపై తీవ్ర ట్రాఫిక్ స్తంభించిపోయింది. ధర్నా స్థలానికి చేరుకున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నాయకులు మరియు రైతులతో చర్చలు జరిపారు. 24 గంటల వ్యవధిలో కాలువలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. 24 గంటల్లో నీళ్లు ఇవ్వని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు.



## నిమజ్జనాన్ని నీటిని విడుదల చేయడి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా :**

కరీంనగర్లో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించడానికి ఎస్సారెస్పీ కాల్వకు నీటి విడుదల చేయాలని బిజెపి ఆధ్వర్యంలో చలో చింతకుంట కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఆధ్వర్యంలో చేపట్టారు చింతకుంట కాలువపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు హిందువుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూపిస్తుందని సునీల్ రావు ఆరోపించారు చింతకుంట బుజ్జిపై రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కడెక్కడ నడిచిపోయాయి గణేష్ నిమజ్జనానికి కేవలం రెండు రోజులే సమయం ఉ ండగా ఇంతవరకు నీటిని విడుదల చేయకపోవడం తో నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు బిజెపి నాయకుడు తెలిపారు వెంటనే ఎస్సారెస్పీ ద్వారా చింతకుంట కాల్వకి నీటి విడుదల చేయాలని డిమాండ్ చేశారు గణేష్ నిమజ్జనానికి నీటిని విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




## నమ్మించి మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా:**

కొనుగోలు చేసే ప్రతి వస్తువులు ఇలా తరుగుదల ఉంటుంది వ్యాపారులు విక్రయించే వస్తువులు తూకం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నష్టపోతున్నారు. తనిఖీ చేసే సమయంలోనే వ్యాపారులు తమ త్రాసులను, ఎలక్ట్రిక్ తూకం యంత్రాలను సరి చేసుకుంటున్నారు. అధికారులు అటు కదలగానే మళ్లీ యధావిధిగా మోసాలకు పాల్పడుతు న్నారు. ఈ మోసం వల్ల ప్రతి కిలోకు వినియోధానికి ఎంతో కొంత వ్యత్యాసం వస్తుంది. కిలో వస్తు కొనుగోలు చేస్తే కనీసం 100 గ్రాముల వరకు నష్టపోతున్న సందర్భాలు ఉన్నాయి.

**లక్షల రూపాయలు జేబుల్లోకి...**

ప్రస్తుతం మార్కెట్లో కొన్ని రకాల బియ్యం 26 కిలోలుగా బస్తాలు ముద్రిస్తున్నారు. కానీ అందులో 25 కిలోల బియ్యం ఉంటున్నాయి. అంటే ఒక బస్తాకు కిలో బియ్యం చొప్పున నష్టపోతున్నారు. కానీ వ్యాపారులు 26 కిలోలు బియ్యానికి డబ్బు లెక్క కడుతున్నారు. దీంతో ఒక బస్తాలో కిలో బియ్యం అంటే కనీసం 150 రూపాయలు నష్టపోవాల్సి వస్తుంది. నెలకు కనీసం 50,000 మంది కొనుగోలు చేస్తారు అంటే 75 లక్షల రూపాయలు వ్యాపార జేబుల్లోకి చేరుతున్నాయి జిల్లాలో 7.5 లక్షల జనాభా ఉంది.

**నిర్వహణలో నిర్లక్ష్యం**

సాధారణంగా ఎలక్ట్రిక్ తూకం యంత్రాలను సున్నితంగా వినియోగించాలి లేదంటే అందులో ఉండే సెన్సార్ దెబ్బతింటాయి ఫలితంగా వస్తువు తూకం వేసే సమయంలో వ్యత్యాసం వచ్చే అవకాశం ఉంది దీన్ని వ్యాపారులు దుకాణాల నిర్వాహకులు గుర్తించడం లేదు ఎలక్ట్రిక్ టుకు యంత్రాలు సంవత్సరానికి ఒకసారి త్రాసు బాట్లతో తూకం వేసే యంత్రాలను రెండేళ్లకు ఒకసారి పరీక్ష చేయించాలి. దీంతో తూనికలు కొలతల శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనబడు తుందన్న ఆరోపణలు ఉన్నాయి.

## వార్డు సభ్యుల ఫోరం కరీంనగర్ జిల్లా కో ఇంచార్జీగా ఆసిఫ్

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా:**



కరీంనగర్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరం జిల్లా కో ఇంచార్జీగా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన వార్డు మెంబర్ ఆసిఫ్ హబీబ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్బీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా బొజ్జ గణపయ్య లడ్డూ వేలంపాట

**రూ.1,60,000 వేలకు దక్కించుకున్న దండ రామకృష్ణారెడ్డి**

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్ర పరిధిలోగల ఎస్సీఎల్ గోదావరి ఎల్బీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నవరాత్రుల సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడి లడ్డూను నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో రూ. 1,60,000 వేలకు దండ రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ లడ్డూ వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. దండ రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు లడ్డూను దక్కించుకోవడంతో నిర్వాహకులు, స్థానిక భక్తులు వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.వవ కార్యక్రమంలో డి ఆర్ కె రెడ్డి,ఎం రాజు,మహేష్,ఓంనాథ్ రెడ్డి,సతీష్ పెట్ల ,బి సతీష్ ప్రవీణ్ కుమార్ ,అంజి రెడ్డి,దీక్షిత్ రెడ్డి,నగేష్ కుమార్ ,సిద్దేశ్వర్ ,సదానంద్ లు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046